

గ్రంథాలయంలో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో బుధవారం ఆ శాఖ జిల్లా కార్యదర్శి వెంకటరావు సందర్శించి రికార్డులను తనిఖీ చేపట్టారు. గ్రంథాలయ నిర్వహణ సక్రమంగా ఉండటంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అనేక రకాలైన కాంపిటేటివ్ ఉద్యోగాలకు సంబంధించిన పుస్తకాలతో పాటు వివిధ ఉన్నత విద్యకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రంథాలయాలు సామాన్య, మధ్య తరగతికి చెందిన వారి ఉన్నత చదువుల కోసం ఉపయోగపడతాయని చెప్పారు. నిరుద్యోగ యువత సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ అధికారిని ఎస్.సునీత, ఓఎస్ కే.సుబ్బారావు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న వెంకటరావు

30వ రోజుకు అంగన్‌వాడీ

-నోటీసులకు భయపడేది లేదు- పలుచోట్ల కొనసాగిన వినూత్న నిరసనలు



చింతపల్లిలో ర్యాలీ చేపడుతున్న అంగన్‌వాడీలు



అడ్డతీగలలో 30 ఆకారంలో నిరసన చేపడుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తే అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 30వ రోజు కొనసాగింది. దుంబ్రిగుడలో థింసా నృత్యం చేశారు. మిగిలిన చోట్ల ఆందోళనలు చేపట్టారు.

పాడేరు: కనీస వేతనం, గ్రాడ్యుటి చెల్లించాలని కోరుతూ సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రభుత్వ నిర్బంధాల పై బుధవారం నిరసన చేపట్టారు. సమ్మెలో భాగంగా ఐటిడిఏ వద్ద అంగన్వాడీలు నిరవధిక దీక్ష కొనసాగించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్. సుందర్రావు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, అంగన్వాడీలు చేపట్టిన ఉద్యమాన్ని ప్రభుత్వం పట్టించుకోకుండా పక్క దారి పట్టించేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా షోకాజ్ నోటీసులు ఇస్తూ ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు జయ, అంబికా, చిన్నారి, సత్యవతి, దేవి, లక్ష్మి, భారతి, విమల పాల్గొన్నారు.

థింసా నృత్యం చేస్తూ ఆందోళన

దుంబ్రిగుడ: సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్మికులు, హెల్పర్లు మండల కేంద్రంలోని హైవే రోడ్డు యూనియన్ బ్యాంక్ జంక్షన్ వద్ద బుధవారం గిరిజన సంప్రదాయమైన గిరిజన సంప్రదాయమైన థిసా నృత్యాన్ని ప్రదర్శిస్తూ వినూత్న రీతిలో ఆందోళన కొనసాగించారు.

పెదబయలు: మండల కేంద్రంలో సమ్మె 30వ రోజు కొనసాగింది. ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్తామంటూ అంగన్వాడీ యూనియన్ నేతలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట దీక్ష శిబిరం వద్ద అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. అంగన్‌వాడీలకు ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను మద్దతు తెలిపారు. మెమోలు జారీ చేసి అంగన్వాడీలు విధుల్లో చేరాలని, లేనిపక్షంలో ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, సిఐటియు మండల కార్యదర్శి శంకర్రావు, అంగన్వాడి మండల యూనియన్ నాయకులు కాంతమ్మ, ఈశ్వరమ్మ, సుజాత పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలో పాత బస్టాండ్ వరకు అంగన్వాడి యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు పెంటమ్మ, రాములమ్మ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.మధ్యాహ్న భోజనం కార్మికులు మద్దతు తెలిపారు.. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సెక్టార్ నాయకురాలు నీలమ్మ, లక్ష్మి, ఇందు, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు పీ.లక్ష్మి పాల్గొన్నారు.

అనంతగిరి: అంగన్వాడీలు చేపట్టిన సమ్మె నేటికీ 30 రోజులకు చేరుకున్నా రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్టు లేదని స్థానిక సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు తెలిపారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతు తెలిపిన ఆయన మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నపుడు ఇచ్చిన మాట ప్రకారం కనీస వేతనం రూ.26 వేల హామీ ఏమైందని ప్రశ్నించారుజఈ కార్యక్రమంలో టోకురు సిపిఎం సర్పంచ్, సిఐడియూ మండల కార్యదర్శి కె. మొస్య, సిపిఎం మండల కార్యదర్శి ఎస్.,నాగులు. అంగన్వాడి యూనియన్ నాయకురాలు లక్ష్మీ, మంజుల, కళావతి, చిలకమ్మ పాల్గొన్నారు.



రాజ ఒమ్మంగిలో సొమ్మసిల్లి పడిపోయిన కార్యకర్త

రాజవొమ్మంగి: స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా అంగన్‌వాడీలు దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలు సర్కిల్‌గా ఏర్పడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నిర్మల మాట్లాడుతూ, ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకుండా ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా తగ్గేది లేదని స్పష్టం చేశారు. సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు, యూనియన్ నాయకులు సిహెచ్ కుమారి, కె.వెంకటలక్ష్మి, ఎల్ సత్యవతి, నూక రత్నం, రమణ, రమణి, మంగ, సుందరమ్మ, రత్నం, మేరీ పాల్గొన్నారు.

రంపచోడవరం : మండల కేంద్రంలో అంగన్వాడీ దీక్షలు బుధవారం నాటికి 30వ రోజుకు చేరాయి. వీరి ఆందోళనకు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, రైతు సంఘంతో పాటు పలు సంఘం నాయకులు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యమంపై ఎస్మా ప్రయోగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పల్లపు వెంకట్, కె.శాంతిరాజు, గిరిజన సంఘం నేత ఈ.సిరిమల్లిరెడ్డి, రైతు సంఘం నేతలు ఐవి.సుబ్బారెడ్డి, పోతిరెడ్డి భాస్కర్, పల్లబోలు రమణ, షర్మిల, 108 ఉద్యోగుల సంఘం నాయకులు పుష్పరాజు. నాగేశ్వరరావు. గిరిజన సంక్షేమ శాఖ వర్కర్ల యూనియన్ నాయకులు కారం శ్రీను, జి.వెంకటేశ్వరరావు, టి.వరలక్ష్మి, రత్నం పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మండలంలో అంగన్వాడీల సమ్మె బుధవారం నాటికి 30వ రోజుకు చేరింది. వీరి ఆందోళనకు గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మద్దతు పలికారు. యూనియన్ నాయకులు రత్నకుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

అడ్డతీగల : మండల కేంద్రంలో అంగన్వాడీల నిరసన శిబిరాన్ని సిఐటియు, గిరిజన సంఘం నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఈ సిరిమల్లె రెడ్డి, పి.రామరాజు, అంగన్వాడీ నేతలు బి నిర్మల, కె రాణి, పి రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : మండల కేంద్రంలో 30వ రోజు ఆందోళనను యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు సవలం వెంకటరమణ ప్రారంభించారు. కార్యక్రమంలో యూనియన్ కోషధికారి కామేశ్వరి, నాయకులు జయ, కన్నకదుర్గ, ముత్తమ్మ, లలిత, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లిలో అంగన్వాడీల సమ్మె 30వ రోజుకు చేరింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ జిల్లా సభ్యులు సున్నం, రంగమ్మ మండల కార్యదర్శి రాజేశ్వరి పాల్గొన్నారు.

విఆర్.పురం : కూనవరం మండల కేంద్రంలో అంగన్వాడీల చేపట్టిన దీక్షా శిబిరాన్ని సిపిఎం ఎటపాక మండల కార్యదర్శి ఐ. వెంకటేశ్వర్లు బుధవారం సందర్శించి సంఘాభావం తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిఎస్ఎం నాయకులు సుబ్బారావు, కన్నారావు, సుమన్, యూనియన్ నాయకులు లలిత, ప్రసన్న, సోడే అజ్జమ్మ, తెల్ల ముత్తమ్మ, ముచ్చక అరుణ, సోడే అజ్జమ్మ, మడం అన్నపూర్ణ పాల్గొన్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన అంగన్వాడీ వర్కర్

రాజవొమ్మంగి : స్థానిక ఆర్అండబి అతిథిగృహం ఎదురుగా అంగన్వాడి వర్కర్లు చేపట్టిన దీక్ష శిబిరం వద్ద లాగరాయి గ్రామానికి చెందిన లాగరాయి అంగన్వాడి కేంద్రం-1 వర్కరు కె మంగ బుధవారం ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయారు. రోజు లాగానే మంగ సమ్మె శిబిరానికి చేరుకొని నినాదాలు చేస్తుండగా కళ్ళు తిరిగి పడిపోయారు. ఇది గమనించిన తోటి వర్కర్లు ఆమెకు సఫర్యాలు చేసి, అనంతరం ఆసుపత్రిలో చికిత్స అందించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి నిర్మల పరామర్శించి ఎటువంటి ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు.



పాడేరులో...



మల్కన్‌గిరి జిల్లా ఎస్పీ ఎదుట లొంగిపోయిన మహిళ మావోయిస్టు మాధవి

మహిళా మావోయిస్టు లొంగుబాటు

ప్రజాశక్తి- సీలేరు

ఆంధ్ర -ఒడిశా సరిహద్దుల్లోని మావోయిస్టు పార్టీ చత్తీస్‌ఘడ్ దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులుగా పని చేస్తున్న ఉంగి మాధవి అలియాస్ రోషిణి బుధవారం ఉదయం 10 గంటల సమయంలో మల్కనగిరి జిల్లా ఎస్పీ నితీష్ వద్వానీ ఎదుట లొంగిపోయారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లా పిట్టదబ్బా గ్రామానికి చెందిన మాధవి 2016 నుంచి మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్నారు. ఆమెపై లక్ష రూపాయలు రివార్డు ఉన్నట్లు ఎస్పి తెలిపారు. ఒడిశాలో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ పరిధిలో పనిచేస్తున్న మాధవి ఒడిశా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితురాలై మావోయిస్టు పార్టీని వీడి జనజీవన స్రవంతిలో కలవడానికి వచ్చినట్లు ఎస్పీ నితీష్ వాద్వానీ చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కల్పించే పునరావస సదుపాయాలన్నీ మాధవికి కూడా కల్పిస్తామని ఎస్పీ వెల్లడించారు.



ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు, కొండాయిగూడెం గ్రామస్తులు

పాఠశాల భవనం నిర్మించాలని పిఒకు వినతి

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని కొండాయిగూడెం గ్రామంలో పాఠశాల అధ్వానంగా ఉందని, కొత్త భవనం నిర్మించాలని చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్యకు సిపిఎం ఆధ్వర్యాన బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య మాట్లాడుతూ గామంలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, పెచ్చులూడి ప్రమాదకరంగా ఉందని పేర్కొన్నారు. దీనిపై ఎన్నో సార్లు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. 7 సంవత్సరాలుగా వర్షం వస్తే పూర్తిగా కారిపోతుందని, పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే భయపడుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కొత్త భవనం నిర్మిచాలన్నారు. దీనికి స్పందించిన పిఒ కావూరి చైతన్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ శాఖతో మాట్లాడి అంచనా వేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సోడే ముత్తయ్య, స్థానిక ఎంపీటీసీ జయసుధ, సిపిఎం నాయకులు రమ్య, కొండయ్య సావిత్రి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెం థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద డిగ్రీ కళాశాల విద్యార్థులు

డిగ్రీ కళాశాల విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

ప్రజాశక్తి-చింతూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు, కళాశాల సిబ్బంది తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో గల కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌కి పారిశ్రామిక సందర్శన నిమిత్తం వెళ్లినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం తెలిపారు. కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌లో బొగ్గు నుండి విద్యుత్ ఉత్పత్తి జరిగే ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సమీపంలో ఉన్న కిన్నెరసాని ఆనకట్ట, జలాశయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, అధ్యాపకులు జి.వెంకట్రావు, ఆర్.సి హెచ్.నాగేశ్వరరావు, డాక్టర్ వై.పద్మ, ఎస్.అప్పనమ్మ, జి.హారతి, కె.శైలజ, బి.సంగం నాయుడు, వి.శీనయ్య, కె.శ్రీలక్ష్మి, ఎన్.రమేష్, ఆర్.మౌనిక, పి.ఏడుకొండలు, జి. సాయికుమార్, పి.అలివేలు, బి.సుబ్బారావు, ఎన్.కన్నయ్య, జి.మంగయ్య పాల్గొన్నారు.

విద్య ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు

అల్లూరి సీతారామరాజు జిల్లా వై రామవరం మండలం బొడ్డగండి పంచాయితీ బచ్చులురు గ్రామంలో సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్ ఆధ్వర్యాన స్పెషల్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం విద్య ఆవశ్యకత తెలుపుతూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. 'పని వద్దు.. బడి ముద్దు..' 'పనికి ఎందుకురా తొందర.. చదువుకో ముందర..' అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సాయిరాం మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో యువత ఉన్నత చదువులకు దూరమవుతున్నారన్నారు. గిరిజన యువత ఉన్నత చదువులు అభ్యసించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. చెడు మార్గాలని విడనాడి సన్మార్గంలో నడిచి ఉన్నత శిఖరాలు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీలేరు జూనియర్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు



నినాదాలు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న, పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి-హుకుంపేట: సమస్యలను పరిష్కరించాలని మండలంలోని మిడ్ డే మీల్స్ వర్కర్స్, శానిటరీ వర్కర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం నుండి మెయిన్ బజార్ మీదుగా ఎం ఈఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తమార్బ అప్పలకొండ పడాల్ మాట్లాడుతూ, కనీసం వేతనం 26 వేలు ఇచ్చి, 9 నెలల పెండింగ్ జీతాల బకాయిలు చెల్లించాలన్నారు. ప్రమాద భీమా, గుర్తింపు కార్డులు, యూనిఫామ్, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, మెరకచింత మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణ్ రావు, తడిగిరి వైస్ సర్పంచ్ కిల్లో రామారావు, మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వంతాల స్వప్న, కార్యదర్శి మర్రి వరలక్ష్మీ, నాయకులు పీ బాబూరావు, పాంగి మత్స్యరాజు, కొర్ర సోమరన్న పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

ప్రజాశక్తి-చింతపల్లి: మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వక పోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు సంక్రాంతి పండగ ఎలా చేసుకుంటారని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ ప్రశ్నించారు. బుధవారం మధ్యాహ్న భోజనం కార్మికులతో కలిసి చింతపల్లి డిప్యూటీ తహసిల్దార్‌కు వినతి పత్రం అందించారు. జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు మూడు నెలల నుండి వేతనాలు ఇవ్వలేదని మండిపడ్డారు. ఇచ్చే తక్కువ వేతనాలకు ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. తక్షణమే బకాయి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు పసుపులేటి లక్ష్మి, మండల అధ్యక్షులు పద్మ, జ్యోతి, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

12న స్పందన

ప్రజాశక్తి-పాడేరు: జగనన్నకు చెబుదాం స్పందన ప్రత్యేక కార్యక్రమం పాడేరు ఐటిడిఎ సమావేశ మందిరంలో ఈనెల 12న జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గత వారం అనివార్య కారణాలతో స్పందన రద్దయిన విషయం విదితమే. పాడేరులో జరగనున్న స్పందనకు ప్రజలు హాజరై వినతులు అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని

అవుట్ సోర్సింగ్ కార్మికుల ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-రంపచోడవరం

గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిధిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు ముఖ్యమంత్రి హామీ మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఔట్సోర్సింగ్ కార్మికులు బుధవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, ఐటిడిఎ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఔట్సోర్సింగ్ కార్మికుల శ్రమను ఐటిడిఎ దోచుకుంటుందన్నారు. చాలీచాలని జీతాలతోనే ఏళ్ల తరబడి పనిచేస్తున్నారని, వీరికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియార్టీ ప్రకారం రెగ్యులర్ చేయాలని, కనీస వేతనాలు రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని, విద్యార్థుల సంఖ్య కనుగుణంగా సిబ్బందిని నియమించాలని విధుల్లో చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని, మెడికల్ లీవులు, సీఎల్సు ఇవ్వాలని, ప్రమాద బీమా రూ.10 లక్షలు చెల్లించాలని, హాస్టళ్లకు గ్యాస్ పొయ్యిలు, సిలిండర్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మె బాట పట్టవలసి వస్తుందని హెచ్చరించారు.



ఐటిడిఎ ఎదుట ధర్నా చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ ఐటీడీఏలు గిరిజనులకు మేలు చేయకుండా గిరిజన కార్మికులను శ్రమదోపిడీ చేయడం దారుణమన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్జల్‌కి వినతిపత్రం అందించారు. దీనికి స్పందించిన ఆఫ్జల్ మాట్లాడుతూ రాష్ట్ర గిరిజన శాఖకు ఈ సమస్యలను నివేదించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శాంతిరాజు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లె రెడ్డి, యూనియన్ నాయకులు కారం శ్రీను, సోడి దుర్గారావు, కోసం శ్రీనివాసు, కారం చంద్రమ్మ, పుల్లమ్మ, తిరుపతమ్మ,, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, రత్నం, ఎన్ వెంకటేశ్వర్లు, బాలమ్మ, వీరస్వామి, బ్రహ్మయ్య, వీరయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి

గృహ నిర్మాణ సామగ్రి వితరణ

ప్రజాశక్తి-చింతూరు, ఎటపాక

అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి రోడ్డు పడ్డ కుటుంబానికి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు గృహ నిర్మాణ సామగ్రిని అందించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో గత నెల 19వ తేదీన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రావి భూషణం అనే వ్యక్తి ఇల్లు పూర్తిగా దగ్ధమై, కట్టుబట్టలతో రోడ్డుపై పడ్డాడు. పేద కుటుంబానికి చెందిన భూషణంకు నిలువ నీడ లేకుండా పోయిందని తెలుసుకున్న ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ గత వారం రావి భూషణం వద్దకు వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు. కొత్త ఇంటి నిర్మాణానికి కావాల్సిన సామగ్రిని సమకూర్చుతానని చెప్పారు. ఈ మేరకు బుధవారం జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంట్ రేకులు, ఇనుప పైపులను అందజేశారు. ఇటుకలు కొనుగోలు చేసేందుకు నగదు ఇచ్చారు. ఎంతో మానవతా దృక్పథంతో రెండుసార్లు బాధ్యత కుటుంబాన్ని సందర్శించి కష్టాన్ని తెలుసుకొని ఆదుకున్న జమాల్ ఖాన్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెకెసి ట్రస్ట్ ఇన్చార్జి సయ్యద్ సుభాని, గ్రామ పెద్దలు కరి వెంకట్రావు, కరి నరసింహారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సిమెంట్ రేకులు, ఇనుము పైపులు అందిస్తున్న జమాల్ ఖాన్ తదితరులు



పనులను పరిశీలిస్తున్న వైస్ ఎంపిపి

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని గేదెలపాడులో తారు రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు పనులకు గత యేడాది వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు స్థానిక సర్పంచ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. సంవత్సరం నిరీక్షణ తరువాత ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభించారు. తారు రోడ్డు పనులను గుత్తేదారు పుట్టు సర్పంచ్ కృష్ణారావుతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, పోరాటాల ఫలితంగా తారు రోడ్డు మంజూరైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ జగన్, వాలంటీర్ శోభ, అప్పల నాయుడు, స్థానికులు పాంగి నాగేశ్వరరావు, అప్పన్న పాల్గొన్నారు.



భోజనాలు చేస్తున్న గిరిజనులు

సంక్రాంతి వన భోజనాలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని మారు మూల అండిబ పంచాయతీ కంచరాయి గ్రామంలో హుకుంపేట మండలం పెల్లోషిప్ అధ్యక్ష కార్యదర్శులు వి.మోజెస్, కె.జేమ్స్ ఆర్థిక సహాయంతో బుధవారం గ్రామంలో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వన భోజనం ఏర్పాటు చేసి గ్రామంలో ఉన్న పిల్లలు, పెద్దలు, వృద్ధులు సంతోషంతో విందుని ఆరగించారు. ఈ సందర్భంగా ఆ గ్రామస్తులు కొర్రా నాగరాజు, కొండన్న మాట్లాడుతూ, గ్రామంలో సేవా కార్యక్రమాలతో తమను ఆదుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సూరిబాబు, కె.ఆనంద్, పాస్టర్లు డేవిడ్, సత్యారావు, సోమరాజు, సంఘ సభ్యులు బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఎపి గీత కార్మిక సేవా సంఘం అధ్యక్షునిగా రాము

ప్రజాశక్తి -ఆనందపురం : ఆంధ్ర ప్రదేశ్ గీత కార్మిక సేవా సంఘం (యాత సంక్షేమ సేవా సంఘం) నూతన కార్యవర్గాన్ని బుధవారం ఆనందపురంలో ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా చోడి ఆదినారాయణ, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అంగిటి రాము, గొర్ల సూరిబాబు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఆడబోయిన లక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వనము శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా చిట్టిబోయిన రాము, అంబోతు అప్పారావు, అంగిటి నానాజీ, కార్యదర్శులుగా బాదితబోయిన రాములప్పుడు, చెల్లుబోయిన దుర్గారావు, పట్నాల వెంకటేష్, ఉప కార్యదర్శులుగా బుత్తల రాజు, అంగిటి మూర్తి సహా కార్యదర్శులుగా కర్రి మాణిక్యం, వడిశల శ్రీను, కమిటీ సభ్యులుగా కొప్పా రాములప్పు జిత్తూరు ఎన్నికయ్యారు, రీసు రమణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు అంగిటి రాము మాట్లాడుతూ, వరుసగా రెండవసారి అధ్యక్ష పదవి అప్పగించడంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లాల యాత సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆందోళనలో నిరుద్యోగులు

దరఖాస్తు చేసుకునేందుకు అవస్థలు
గ్రూపు 2 అభ్యర్థులను వేధిస్తున్న సర్వర్ సమస్య

ప్రజాశక్తిదుంబ్రిగుడ: ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్ 2 పోస్టుల భర్తీ నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులను అప్లై చేసుకునేందుకు ఆన్లైన్ ద్వారా గత నెల నుంచి ఈ నెల 10వ తేదీలోపు నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాలకు ఆన్లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంది. గ్రూప్ 2 పోస్టులకు అప్లై చేసుకునే అభ్యర్థులకు మొదటి నుంచే ఇంటర్నెట్ సర్వర్ మోరాయిస్తుండడంతో అప్లై చేసుకోవడానికి నిరుద్యోగ అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుంచి నిరుద్యోగ అభ్యర్థులు ఆన్లైన్ సెంటర్లకు రోజుల తరబడి తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా గిరిజన ప్రాంతంలో మరింత సమస్య ఏర్పడుతుంది. సర్వర్ సమస్య కారణంగా ఒక అభ్యర్థి అప్లికేషన్ ఆన్లైన్ లో నమోదు చేసుకోవడానికి గంటల తరబడి ఆన్లైన్ సెంటర్లలో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అభ్యర్థులు వాపోతున్నారు. నిరుద్యోగ అభ్యర్థులు అప్లై చేసుకోవడానికి ఆన్లైన్ సెంటర్లను ఆశ్రయించారు. నమోదు చేసుకోవడానికి ఒకరికి రెండు మూడు గంటలు సమయం పడుతుందని, అది కూడా అప్లికేషన్ రిజిస్టర్ అయిన తర్వాత పేమెంట్ అవ్వకుండా నిలిచిపోతుందని అభ్యర్థులు అంటున్నారు. చివరి రెండు రోజులు అప్లై చేసుకోవడానికి నిరుద్యోగ అభ్యర్థులు రాత్రి, పగలు ఆన్లైన్ సెంటర్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటి నుంచే సర్వర్ సమస్య తలెత్తుతుందని, ప్రభుత్వం గడువు ఈ నెల 17 వరకు పెంచినప్పటికీ సర్వర్ సమస్య తలెత్తకుండా సక్రమంగా ఆన్లైన్‌లో నమోదయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ యువత కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాలపై నివేదిక ఇవ్వాలి

పిఒ అభిషేక్



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఏ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-అరకులోయ:రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల విధులు కీలకమని ఐటిడిఏ పిఒ వి. అభిషేక్ అన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో అరకు అసెంబ్లీ నియోజక వర్గం సెక్టార్ అధికారులతో ఎన్నికల విధులు, బాధ్యతలు, పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సెక్టార్ అధికారుల ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాలను ముందుగా సందర్శించి అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలపై నివేదించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు వంటి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ భవనాలలో మాత్రమే పోలింగ్ ప్రక్రియ జరగాలని స్పష్టం చేసారు.సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి సమాచారం అందించాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలకు సకాలంలో ఓటింగ్ యంత్రాలను చేర్చి, తిరిగి సకాలంలో స్ట్రాంగ్ రూంలకు తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వేణుగోపాల్, గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇ కె.వేణుగోపాల్, నియోజక వర్గం పరిధిలోని సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా పోటీలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మారుమూల గ్రామాల్లో ఉన్న నైపుణ్య క్రీడాకారులను బయటికి తీయడమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని చేపడుతుందని స్థానిక ఎంపీపీ ఈశ్వరి, జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ చెప్పారు. ఆడుదాం ఆంధ్రలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడారంగంలో మంచి నైపుణ్యత సాధించి బహుమతులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనందరావు, మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, సర్పంచ్ రామ్మూర్తి, జడ్పిటిసి శ్రీరాములు, నాయకులు గోపాల్, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

జెవివి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- గాజువాక : జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యాన రూపొందించిన వార్షిక కేలండర్‌ను బుధవారం గాజువాకలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా శాస్త్ర ప్రచారంలో భాగంగా విద్యావేత్తలు, విద్యార్థులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. దేశ, ప్రపంచ శాస్త్రవేత్తల ఆవిష్కరణలను గుర్తుచేస్తూ ఈ కేలండర్‌ను జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ రూపొందించడం ముదావహమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి పివి.గోపాలరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌వికె.పరశురాం, కె.శేషగిరిరావు, ఉపాధ్యక్షులు వైఆర్‌కె.ప్రసాద్, సహాయ కార్యదర్శి పి.లక్ష్మణస్వామి, జిల్లా నాయకులు ఎల్.కృష్ణారావు, రత్నారావు, అప్పలరెడ్డి, సత్యనారాయణ, కెవి.ప్రసాద్, వెంకటరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో వెస్టన్ ఆస్ట్రేలియన్ కార్నర్ సాఫ్ట్‌లాంచ్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో వెస్టన్ ఆస్ట్రేలియన్ కార్నర్ సాఫ్ట్‌లాంచ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత, యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా ప్రో చాన్సలర్ జెన్నిఫర్ హెూవెల్‌లు దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత మాట్లాడుతూ, ఆంధ్రవిశ్వవిద్యాలయం అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది, ప్రయోగశాలలు, గ్రంథాలయం వంటి వసతులను కలిగి ఉందని వివరించారు. ఏయూలో 1084 మంది 58 దేశాలకు చెందిన విదేశీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వీరికి అవసరమైన హాస్టల్స్, వసతులను ఏయూ కల్పించిందని తెలిపారు. ఆస్ట్రేలియా వర్సిటీ ప్రో చాన్సలర్ జెన్నిఫర్ హెూవెల్ మాట్లాడుతూ, విభిన్న రంగాలలో ఏయూతో కలసి పనిచేస్తామన్నారు. ఏయూలో నిర్వహిస్తున్న కోర్సులు, వసతులు, విదేశీ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు తదితర అంశాలపై ఒఎస్‌డి ఆచార్య వి.కృష్ణమోహన్ వివరించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ ఏయూలో ఇప్పటికే సమర్థవంతంగా నిర్వహిస్తున్న అమెరికన్ కార్నర్ పనితీరు, నిర్వహించిన కార్యక్రమాలు వివరించారు. ఉన్నత విద్యమండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి వర్చువల్ విధానంలో పాల్గొని రెండు విశ్వవిద్యాలయాల ప్రతినిధులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గవర్నమెంట్ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడ్ కమిషనర్ (ఇండియా-గల్ఫ్) నషీద్ చౌధురి, ఇన్వెస్ట్ అండ్ ట్రేడ్ వెస్టన్ ఆస్ట్రేలియా ఎడ్యుకేషన్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఆంటోని జోసెఫ్, ఏయూ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్‌కె.భట్టి, వి.విజయలక్ష్మి, వై.రాజేంద్రప్రసాద్, ఎ.నరసింహారావు, జి.శశిభూషణరావు, ఆచార్య టి.శోభశ్రీ, గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాంబశివరావుకు జర్నలిజంలో డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం జర్నలిజం విభాగ పరిశోధక విద్యార్థి కె.సాంబశివరావుకు ఏయూ జర్నలిజం విభాగం నుంచి డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు చల్లా రామకృష్ణ పర్యవేక్షణలో 'పాపులర్ తెలుగు రేడియో డ్రామాస్- ఏన్ ఎనలిటికల్ స్టడీ' అనే అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఏయూ ఇంచార్జి వీసీ ఆచార్య కె.సమత నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను సాంబశివరావు బుధవారం స్వీకరించారు.

గీతంలో 'జెమ్- 24'

ప్రజాశక్తి-విశాఖపట్నం : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి యువజనోత్సవం గీతం ఎక్సలెన్స్ మీట్ 2024 బుధవారం అట్టహసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణి పప్పు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ వాణిజ్యరంగంలో వస్తున్న మార్పులు, ఫిన్ టెక్ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానం, బిజినెస్ అనలిటిక్స్ విద్యార్థులకు అపార అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. కాలానుగుణ మార్పులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. జెమ్ 2024 కన్వీనర్ డాక్టర్ కె.అశోక్, కో-కన్వీనర్లు డాక్టర్ జోసఫ్ పాల్, వి.చందన తదితరులు పాల్గొని ప్రసంగించారు.

స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆహ్వానం మేరకు వివిధ కళాశాలల నుంచి తరలివచ్చిన విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలతో పాటు మేధస్సుకు పదును పెట్టే బిజినెస్ క్విజ్, బృంద చర్చలు, సాంస్కృతిక పోటీలను మొదటిరోజు నిర్వహించారు. సంప్రదాయ నృత్యాలతో పాటు పాశ్చాత్య గీతాలు, నృత్యాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. పోటీలలో పాల్గొనడానికి ఇతర రాష్ట్రాల విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. గీతం ఎక్సలెన్స్ మీట్ 2024 ముగింపు విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. కర్తవ్య పేరిట ఈ ఏడాది జెమ్ ఉత్సవంలో కార్పొరేట్ సంస్థల బలోపేతానికి భవిష్యతరం ఏ విధంగా సంసిద్ధమవ్వాలి అనే అంశంపై గురువారం నిపుణుల ప్రసంగాలను ఏర్పాటు చేస్తున్నట్లు జెమ్ సిఇఒ ఇందుకూరి సింధువర్మ తెలిపారు.

ప్రత్యేక సినిమా ప్రదర్శన

ప్రజాశక్తి-సీతమ్మధార : సంక్రాంతి పండుగ సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన బుధవారం విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రత్యేక సినిమాను ప్రదర్శించారు. తమిళ సినిమా దర్శకుడు భారతి రాజా దర్శకత్వంలో 1985లో తమిళంలో రూపొంది తర్వాత తెలుగులో డబ్బింగ్ అయిన ఆత్మ బంధువు సినిమాను ప్రదర్శించారు. శివాజీ గణేశన్, రాధ నటించారు. అనేక ఫిల్మ్ ఫేర్ అవార్డులు పొందింది. ఈ సందర్భంగా కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, పాత సినిమాలు ఆణిముత్యాలు అన్నారు. ఇటువంటి అపురూప చిత్రాలు చూసే అవకాశం వైజాగ ఫిల్మ్ సొసైటీ ద్వారానే సాధ్యం అని చెప్పారు. నగర ప్రజలు సభ్యులుగా చేరి మంచి సినిమాలు చూసే సంస్కృతిని పెంపొందించుకోవాలని కోరారు. చిత్ర ప్రదర్శన అనంతరం సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావురెడ్డి, అనురాధ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బి.గంగారావు

ఎస్మాను రద్దు చేయకుంటే బంద్ చేపడతాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో అంగన్‌వాడీ, ఎస్ఎస్ఎ ఉద్యోగులు, మున్సిపల్ కార్మికులు తమ జీతాల పెంపు, సమాన పనికి సమాన వేతనం, తదితర డిమాండ్లతో నెల రోజులుగా సమ్మె చేస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి మొండిగా వ్యవహరించడం సరైంది కాదని విశాఖ అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మాను ఎత్తివేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బంద్ చేపడతామని హెచ్చరించారు. బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, 78వ వార్డు ఉక్కునగరం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, జనసేన ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జ్ లక్ష్మీ సౌదరి మాట్లాడుతూ అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సిగ్గుమాలినపనని అన్నారు. ఎస్మా చట్టం కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు తప్ప వీరికి వర్తించదన్నారు. తెలంగాణ ప్రభుత్వంకంటే అదనంగా వెయ్యి రూపాయలు పెంచి జీతం చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఒక్క రూపాయి కూడా పెంచలేమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ సీనియర్ నాయకులు వై.కొండయ్య, ఎంసిపిఐ నాయకులు శంకరరావు, సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు దేవా, ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి గోవిందరాజులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు, సమగ్ర శిక్ష ఉద్యోగులపైనా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తోందన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, విశాఖపట్నం పోర్టు, డాక్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు బి.జగన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, ఎస్‌కె.రెహ్మాన్, హాస్పిటల్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, కెవిపిఎస్ నాయకులు వై.రాజు, ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బారావు, మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.అప్పలరాజు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వై.తులసి, ఎల్.దేవి, పద్మావతి, పి.శ్యామలాదేవి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను జిందాల్‌కు అప్పగించొద్దు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను జిందాల్‌కు అప్పగించే చర్యను పోరాటాలతో అడ్డుకొని తీరుతామని విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి బిసిహెచ్.మసేన్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు బుధవారానికి 1014వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్లలో అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందన్నారు. కార్మికవర్గం మోడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దీక్షల్లో యూనియన్ అధ్యక్షులు బిపివి.శంకరన్, ఆర్.రమణబాబు, యు.పోతన్న, పిఎ.బాబు, సిహెచ్.సత్తిరాజులు, కెవి.రమణ, జి.ధనరాజు పాల్గొన్నారు.

షాడో మేయర్ చేతిలో జివిఎంసి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : షాడో మేయర్ చేతిలో జివిఎంసి నడుస్తోందని, వందల కోట్ల అవినీతి జరుగుతోందని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు, జివిఎంసి 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. బుధవారం ఉదయం జివిఎంసి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌన్సిల్‌లో సమస్యల మీద మాట్లాడితే మైక్ కట్ చేయడంపై మండిపడ్డారు. సమావేశంలో జనసేన ఫ్లోర్ లీడర్, 33వ వార్డు కార్పొరేటర్ భీసెట్టి వసంతలక్ష్మి, 39వ వార్డు కార్పొరేటర్ సాధిక్ పాల్గొన్నారు.

విశాఖ వైసిపి ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీ ?

త్వరలో అధిష్టానం నుంచి ప్రకటన
వైజాగ్ రాజకీయాల్లోకి బొత్స కుటుంబం



బొత్స ఝాన్సీ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం పార్లమెంట్ స్థానానికి వైసిపి అభ్యర్థిగా బొబ్బిలి మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి పేరు దాదాపు ఖరారైనట్టు తెలుస్తోంది. త్వరలో పార్టీ అధిష్టానం నుంచి ఆ ప్రకటన రానుందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. రాష్ట్రంలో పలు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను వైసిపి ఇప్పటికే ఖరారు చేసింది. విజయనగరం ఎంపీ అభ్యర్థిగా మజ్జి శ్రీనివాసరావు (బొత్స మేనల్లుడు చిన్న శ్రీను) పేరు దాదాపు ఖరారైంది. ఉత్తరాంధ్రలో సీనియర్ రాజకీయ నాయకునిగా బొత్స సత్యనారాయణ పలుమార్లు మంత్రి పదవులు చేపట్టి రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తుండడంతో ఆయన కుటుంబానికి అడిగిన చోటల్లా నాడు కాంగ్రెస్ సీట్లు ఇచ్చింది. నేడు వైసిపి కూడా అదే పని చేస్తోంది. గతంలో కాంగ్రెస్ హయాంలో బొత్స సత్యనారాయణ రాజకీయాల్లో తాను తలచేది అమలు చేసేవారు. ఇప్పుడూ వైసిపిలో అదే చేస్తున్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తన సతీమణి బొత్స ఝాన్సీలక్ష్మిని విశాఖ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు. 2019 ఎన్నికల్లో విశాఖ నుంచి ఎంపీగా గెలుపొందిన వైసిపి నాయకులు ఎంవివి.సత్యనారాయణ 2024 ఎన్నికల్లో తూర్పు అసెంబ్లీ నుంచి వెలగపూడి రామకృష్ణబాబుపై పోటీకి దిగుతున్న విషయం తెలిసిందే. వీరి మధ్య హోరాహోరీ రాజకీయ పోరు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశాఖ ఎంపీ టికెట్‌ను వైసిపి నుంచి ఆశిస్తున్న వారి సంఖ్య ప్రస్తుతం తక్కువే. ఈ క్రమంలో బొత్స ఝాన్సీలక్ష్మి గతంలో ఎంపీగానూ, విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గానూ రాజకీయ, పరిపాలనా అనుభవం కలిగినవారు కావడంతో వైసిపి అధిష్టానం ఠక్కున ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు తెలుస్తోంది. త్వరలో విశాఖ రాజకీయాల్లో బొత్స కుటుంబం రంగప్రవేశం చేయనున్నట్టు ఇప్పుడు చర్చ నడుస్తోంది. మరోపక్క బిజెపి నుంచి విశాఖ పార్లమెంట్‌కు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి, రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు కూడా తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వారు విశాఖపై దృష్టిపెట్టారు. టిడిపి నుంచి శ్రీభరత్ టికెట్ ఆశిస్తున్నా జనసేన-టిడిపి కాంబినేషన్‌లో పరిణామాలు ఎలా మారతాయో వేచి చూడాల్సిందే.

బస్సులు, రైళ్లు కిటకిట

పండగకు సొంత ఊళ్లకు జనం పయనం



ద్వారకా బస్ స్టేషన్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతికి ఊరెళ్లాలి అనగానే తక్కున గుర్తుకొచ్చేవి బస్సులు, రైళ్లే. పండగ సంతోషాలలో వీటి పాత్ర కీలకమైనది. అందుకే ఈసారి పెద్ద పండగకు ఇవి కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి సమయంలో బస్ టికెట్ ఛార్జీలను పెంచడం మొన్నటి వరకూ ఆనవాయితీగా ఉండేది. కానీ ఈసారి ఆర్‌టిసి బస్సు ఛార్జీలను ప్రభుత్వం పెంచలేదు. అదే సందర్భంలో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్ టికెట్లను ముందుగానే రిజర్వ్ చేసుకుంటే అటు, ఇటు రెండు వైపులా ఛార్జీలో 10 శాతం తగ్గిస్తూ రాయితీ ప్రకటించారు. దీంతో ప్రయాణికులు విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు అధికంగా తరలి వస్తున్నారు. ఈ నెల 9 నుంచి 18 వరకు స్కూళ్లకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు ఇది వర్తిస్తుంది. దీంతో సంక్రాంతికి సొంతూర్లకు వెళ్లేవారు బస్సుల కోసం తరలిరావడంతో స్థానిక ద్వారకా ఆర్‌టిసి కాంప్లెక్స్ బుధవారం కిటకిటలాడుతూ కనిపించింది. ఇదే రద్దీ ఆదివారం వరకూ ఉంటుందని, వచ్చే బుధవారం నుంచి తిరుగు ప్రయాణికులతో బస్ స్టేషన్ రద్దీగా ఉంటుందని ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు. గతంలో కంటే ఈసారి 250 బస్సులను అదనంగా నడుపుతున్నట్లు తెలిపారు. ప్రధానంగా హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, నరసాపురం, రాజమండ్రి, కాకినాడ, శ్రీకాకుళం ప్రాంతాలకు బస్సులను అధికంగా వేసినట్టు వెల్లడించారు. ఇదిలా ఉండగా విశాఖ రైల్వే స్టేషనూ బుధవారం జన రద్దీతో కనిపించింది. ఎక్కడ చూసినా లగేజీలతో ప్రయాణికులే కనిపించారు.



ప్రయాణికులతో కిక్కిరిసిన విశాఖ రైల్వే స్టేషన్



వాకౌట్ సమ్మెలో పాల్గొన్న ఎల్‌ఐసి మహిళా ఉద్యోగులు

వేతన సవరణ కోసం
ఎల్‌ఐసి ఉద్యోగుల వాకౌట్ సమ్మె

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎల్‌ఐసి ఉద్యోగులకు సంబంధించి వెంటనే వేతన సవరణ చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎల్‌ఐసి డివిజనల్ ఆఫీసులో పనిచేస్తున్న ఉద్యోగులు బుధవారం ఒక గంట వాకౌట్ సమ్మె నిర్వహించారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, ఎల్‌ఐసి క్లాస్ 1 ఎంప్లాయీస్ ఫెడరేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇన్సూరెన్స్ ఫీల్డ్ వర్కర్స్ ఆఫ్ ఇండియాతో కూడిన జాయింట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2022 ఆగస్టు నుంచి రావలసిన వేజ్ రివిజన్ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌పిఎస్‌లో ఉన్న ఉద్యోగులకు యాజమాన్యం షేర్ 10 శాతం నుంచి 14 శాతం చేయాలని, కొత్తగా ఉద్యోగాల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు జి.వరప్రసాద్, వై.వెంకటరావు, కె.మోహనరావు, మూర్తి పాల్గొని మాట్లాడారు.

నేడు జెడ్‌పి స్థాయీ సంఘాల సమావేశాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలను గురువారం నిర్వహించనున్నట్టు జెడ్‌పి సిఇఒ ఎం.పోలినాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఈ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు రెండో స్థాయీ సంఘంతో సమావేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు. 10.30 గంటలకు ఐదో స్థాయీ, మధ్యాహ్నం 12 గంటలకు 4, 6వ స్థాయీ, మధ్యాహ్నం 3 గంటలకు 1, 3, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. జిల్లా అధికారులు అందరూ తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల సమగ్ర ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ప్రకటనలో స్పష్టం చేశారు.

రోడ్లపై భోగి మంటలు వేయొద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భోగి మంటలను రోడ్లపై వేయొద్దని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ నగర ప్రజలకు బుధవారం పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. భోగి మంటలలో వాడి పారేసిన పాత టైర్లను ఉపయోగించడం వల్ల కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. భోగి మంటలను బహిరంగ ప్రదేశాలు, మైదానం, ఖాళీ స్థలాలలో వేసుకోవాలని సూచించారు.

మిలాన్ విన్యాసాలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ నేవీ మల్టీ నేషనల్ నావల్ ఎక్సర్‌సైజ్ మిలాన్ 2024ను విశాఖపట్నంలో ఫిబ్రవరి 19-27 మధ్య నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. గతంలో 11వ ఎడిషన్‌ను కూడా విశాఖలోనే నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈస్టర్న్ నేవల్ కమాండ్ బాధ్యతాయుతమైన సముద్ర శక్తిగా మరింత ఎత్తుకు ఎదిగేందుకు, సముద్ర భద్రతను మరింత మెరుగుపరుచుకోవడానికి ఈ విన్యాసాలు తోడ్పడతాయని నేవీ అధికారులు భావిస్తున్నారు.

కొర్ల కృష్ణను శిక్షించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తక్కువ వడ్డీ అర్ధ రూపాయికే వినియోగదారులకు లక్షలాది రూపాయలు రుణాలు ఇస్తామని నమ్మించి పలువురిని మోసం చేసిన నకిలీ కెకెబికె కంపెనీ అధినేత కొర్ల కృష్ణను కఠినంగా శిక్షించాలని బాధితుల పక్షాన పోరాటం చేస్తున్న డాక్టర్ గొలగాని అశోక్ కుమార్ యాదవ్ కోరారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.